RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :190 EDITOR: CHERUKU UPENDAR, DATE : SATURDAY 25 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 190 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 25 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## గడపగడపకు సంక్షేమ పథకాలు

### ఎట్లైంది'పుస్తకావిష్కరణలో కేటీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గడప గడపకు చేరుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాహారంగా రూపొం దించిన 'ప్రగతి ప్రస్థానం.. ఎట్లుండే తెలంగాణ ఎట్లైంది'

మిగతా 2లో



## కేసీఆర్‌ను జైలుకు పంపిస్తాం

### - కేంద్ర హౌం మంత్రి అమిత్ షా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

'త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటుంది. పదేండ్లలో రాష్ట్ర ప్రజల కోసం కేసీఆర్ ఒక్క పని చేయలేదు. కుమారుడు కేటీఆర్ కోసం లక్షల కోట్లు సంపాదించి పెట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చేసిన అక్రమాలు అవినీతిపై విచారణ జరిపి జైలుకు పంపిస్తాం' అని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌లోని బైపాస్ రోడ్డు పక్కన శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ

మిగతా 2లో

## సింగరేణి తెలంగాణ ఆస్తి

### బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలోసీఎం కెసిఆర్



రామగుండం-ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్‌కు చేతగాక సింగరేణిని సమైక్య చేతల చేతుల్లో పెట్టారని సీఎం కేసీఆర్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సింగరేణి 134 ఏళ్ల కింద పుట్టిన మన సొంత కంపెనీ. నిజాం రాజు కాలంలో పుట్టిన కంపెనీ. మన సొంత ఆస్తి. ఈ కాంగ్రెస్ దద్దమ్మ నాయకులకు చేతగాక సమైక్య నాయకుల చేతిలో పెడితే కేంద్రం దగ్గర అప్పులు తెచ్చారు. రూ.600కోట్ల మారటోరియం సింగరేణి మీద ఉండేది. ఆ అప్పులు కట్టుడు చేతగాక మా వళ్లకాదని చేతులెత్తేసి కేంద్రానికి 49శాతం వాటా పుట్టించారు. మన సింగరేణి వందశాతం మనకే ఉంటుండే. అలా లేకుండా చేసిందే కాంగ్రెస్' అంటూ విమర్శించారు. 'తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్. గోదావరి ఒరుసుకుంటు పారే మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో మంచినీళ్ల గోస, కరెంటు గోస. చేనేత కార్మికుల చనిపోవుడు. రైతులు ఆత్మహత్యలు చేసుకునుడు. కరెంటు ఇస్తే తెల్లందాక ఇంత. పొద్దందాక ఇంత. ఆడ పాములు

మిగతా 2లో

## జై బోలో తెలంగాణ

### ప్రియాంక ప్రసంగం




ఖమ్మం- ప్రభాత సూర్యుడు

బోలో తెలంగాణ అని నినదించి కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తన ప్రసంగాన్ని మొదలు పెట్టారు. పాలకుర్తిలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామికి జై కొట్టారు ప్రియాంకా గాంధీ. ఝాన్సీ రెడ్డి కుటుంబం చాలా సేవాభావం గల కుటుంమని ఆమె వెల్లడించారు. రైతుల భూములు లాక్కునే కుటుంబం బీఆర్ఎస్ కుటుంబం అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. యువకుల త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ ఏర్పడిందని.. ఈ రాష్ట్రం పురోగతి చెందాలంటే మీ ఓటు విలువైనది అంటూ ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు. త్యాగం చేసిన వాళ్లు ఒకవైపు, దోపిడి చేసిన వాళ్లు మరోవైపు.. అమరుల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరాయనేది ఆలోచించి ఓటు వేయాలన్నారు. మీరు కష్టపడి

మిగతా 2లో

## బర్రెలక్కకు గన్‌మెన్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుంచి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బర్రెలక్కకు (కర్నె శిరీష) భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికలు పూర్తి అయ్యే వరకూ ఒక గన్ మెన్ ఆమె వెంట ఉండాలని, ఆమె నిర్వహించబోయే పబ్లిక్ మీటింగ్ లకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం గుర్తింపు ఉన్న పార్టీలకు మాత్రమే భద్రత కల్పించడం సరికాదని, ముప్పు ఉన్న ప్రతి అభ్యర్థికి

మిగతా 2లో

## జగన్‌కు సీబీఐ సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



అక్రమాస్తుల కేసులో ఏపీ సీఎం జగన్ బెయిల్ రద్దు చేయాలంటూ ఎంపీ రఘురామ కృష్ణంరాజు వేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ క్రమంలో సీఎం జగన్, సీబీఐ సహా ప్రతివాదులందరికీ జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ పంకజ్ మిత్తల్ నేతృత్వంలోని సర్వోన్నత న్యాయస్థానం నోటీసులిచ్చింది. 'ఇప్పుడే బెయిల్ రద్దు చేయాలా.?' అని ధర్మాసనం పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించగా, నోటీసులు ఇచ్చి తదుపరి ప్రక్రియ చేపట్టాలని కోర్టును కోరారు. ఇప్పటికే విచారణను హైదరాబాద్ నుంచి ఢిల్లీకి మార్చాలని

మిగతా 2లో



## రాజస్థాన్‌లో పోలింగ్

**జైపూర్ - ప్రభాత సూర్యుడు:** రాజస్థాన్‌లో చరిత్ర పునరావతం కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఇక్కడ ఓటర్లు ప్రతి ఐదేండ్లకు ఒకసారి కాంగ్రెస్ లేదా బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎన్నుకుంటున్నారు. ఈ బీజేపీ విజయం సాధిస్తుందనే ధీమాతో ఉండగా, అధికారాన్ని నిలబెట్టు కునేందుకు కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. 200 స్థానాలున్న అసెంబ్లీకి 199 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లో పలు స్థానాల్లో పోటీ తీవ్రంగా మారింది. అందరి చూపు అటు ఇటుగా ఉన్న రాష్ట్రంలోని టాప్ సీట్ల గురించి తెలుసుకుందాం.

**ఝల్రాపటన్:** రాజస్థాన్‌లోని అత్యంత కీలకమైన స్థానాల్లో ఒకటి. ఝల్రాపటన్‌లో బీజేపీ సీనియర్ నాయకురాలు, ఆ రాష్ట్ర మాజీ సీఎం వసుంధర రాజే పోటీలో ఉన్నారు. రాజే 2003 నుంచి ఝల్రాపటన్ నిరంతరం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఐదవసారి ఈ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. వసుంధర రాజే ఎన్నికలలో పోటీ చేస్తున్నప్పుడు కాంగ్రెస్ ఎన్నటికీ చొచ్చుకుపోలేని బీజేపీకి బలమైన కోటగా ఝల్రాపటాన్ పరిగణిస్తారు. 2018 అసెంబ్లీ ఎన్నికల గురించి

మిగతా 2లో

## పదేండ్లలో రూ.6 లక్షల కోట్ల అప్పు

### ప్రజా భరోసా సభలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

తిరుమలగిరి - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన ఆ 12 మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనీయొద్దని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా భరోసా సభల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవి వదులుకున్నాడని, కానీ కేసీఆర్ ఏనాడూ పదవులను వదిలేయలేదని తెలిపారు. ఎలక్షన్లు, సెలక్షన్లు, కలెక్షన్ల విధానంతో కేసీఆర్ ముందుకెళ్లాడని విమర్శించారు. నకిరేకల్‌లో చిరుమర్తిని రెండుసార్లు గెలిపిస్తే నమ్ముకున్న కార్యకర్తల గుండెలపై తన్ని పార్టీ ఫిరాయించి దొర గారి గడిలో ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టాడని అన్నారు. కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజ్‌ని ఇసుకపై మతి ఉండి కట్టాడో మందేసి కట్టాడో అని అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. ఆనాడు వెంకన్న వైఎస్‌తో కొట్లాడి ఎస్ఎల్బీసీ టన్నెల్ ద్వారా 3.60 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని ప్రాజెక్టు మంజూరు చేయించి 30 కిలోమీటర్లు టన్నెల్ తవ్వారని, ఇంకో పది కిలోమీటర్లు పూర్తి చేస్తే ఈ ప్రాంతానికి నీళు వచ్చేవని అన్నారు. కాంగ్రెస్‌కు పేరు వస్తుందనే కారణంతో ఎస్ఎల్బీసీని కేసీఆర్ పడావు పెట్టారన్నారు. 60 ఏండ్లలో 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.69 వేల కోట్లు అయితే పదేండ్లలో కేసీఆర్ కుటుంబం చేసిన అప్పు రూ.6 లక్షల కోట్లు అని తెలిపారు. దీన్ని బట్టి



ఎవడు దొంగ.. ఎవడు గజదొంగ అన్నది తెలంగాణ ప్రజలు ఆలోచించాలన్నారు. నల్లగొండ కాంగ్రెస్ అడ్డా అని, ఉమ్మడి జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. వెంకట్ రెడ్డి, నేను ఇద్దరం అనుకుంటే.. ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ జెండా ఎక్కడా కనిపించదని చెప్పారు. 2014, 2018లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని సాధించాక మొదటిగా దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామన్న హామీని విస్మరించి వారికి తీరని అన్యాయం చేసిందన్నారు. నల్లగొండ జిల్లాలో ఇసుక, భూ మాఫియా జోరుగా సాగుతుందన్నారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో నకిరేకల్‌లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కకుండా చేయాలన్నారు. అబద్ధాలు చెప్పడంలో కల్వకుంట్ల కుటుంబం నెంబర్ వన్ స్థానంలో ఉంటుందన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే, నవంబర్ నెల కరెంటు బిల్లు ఎవరూ కట్టవద్దనీ, కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లిస్తుందని ధీమాగా

మిగతా 2లో

## జగన్‌కు సీబీఐ సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

రఘురామ పిటిషన్ వేయగా, ఆ పిటిషన్ సైతం జత చేయాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను 2024, జనవరి తొలి వారానికి వాయిదా వేసింది.అక్రమాస్తుల కేసులో జగన్ గత పదేళ్లుగా బెయిల్ పై బయటే ఉన్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత సాక్ష్యాలు చెరిపేస్తున్నారని ఆయన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఎంపీ రఘురామ కృష్ణంరాజు తెలంగాణ హైకోర్టులో తొలుత పిటిషన్ దాఖలు చేశారు. అయితే, దీనిపై సీబీఐ సమాధానంతో ఈ పిటిషన్ ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో రఘురామ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారించిన న్యాయస్థానం, 'సాక్ష్యాలు చెరిపేస్తున్నారు అనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా.?' అని ప్రశ్నించింది. దీంతో కేసుకు సంబంధించిన వివరాలు, జరిగిన ఘటనలపై లిఖితపూర్వక వివరాలను రఘురామ తరపు న్యాయవాది కోర్టుకు అందించారు. జగన్ కు బెయిల్ మంజూరు చేసిన తర్వాత దర్యాప్తు సంస్థలు ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేయలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు సీఎం జగన్ సహా, ప్రతివాదులకు నోటీసులిచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.సీఎం జగన్ అక్రమాస్తుల కేసు విచారణ పదేళ్లుగా నత్తనడకన సాగుతోందని, అందుకే మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ కూడా రఘురామ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. 'సీబీఐ నమోదు చేసిన 11 కేసులు ఇప్పటివరకూ 3,041 సార్లు వాయిదా పడ్డాయి. వీటి విచారణ త్వరగా జరిపి నిందితులను శిక్షించాలన్న ఉద్దేశం సీబీఐలో కనిపించట్లేదు. ప్రధాన నిందితుడు జగన్ కు ఇష్టానుసారంగా వాయిదాలు కోరే స్వేచ్ఛనిచ్చారు. దీని వల్ల కేసు విచారణకు అంతు లేకుండా పోతుంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే కేసు విచారణ ప్రారంభమయ్యే స్థితి కనిపించడం లేదు. అందువల్ల సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాలి. ఈ కేసుల విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలి.' అని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ ను బెయిల్ రద్దు అంశం పిటిషన్ తో జత చేయాలని రిజిస్ట్రీని సుప్రీంకోర్టు ఆదేశించింది.సీఎం జగన్ పై గతంలోనూ ఎంపీ రఘురామ కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో జగన్ బెయిల్ షరతులు ఉల్లంఘిస్తున్నారని బెయిల్ రద్దు చేయాలని సీబీఐ కోర్టులో పిటిషన్ వేశారు. అక్రమాస్తుల కేసులో నిందితులైన వారికి వివిధ పదవులు కట్టబెట్టడం, ఇతర ప్రయోజనాలు కల్పిస్తున్నారని ఇందుకు సాక్ష్యాలుగా కోర్టుకు నివేదించారు. అయితే, ఈ పిటిషన్ ను సీబీఐ కోర్టు కొట్టేసింది.

## బర్రెలక్కకు గన్‌మెన్

(మొదటిపేజీ తరువాయి)

సెక్యూరిటీ ఇవ్వాలని హైకోర్టు నిర్దేశించింది. పోలీసుల బాధ్యత కేవలం కార్లు చెక్ చేయడం కాదని కీలక వ్యాఖ్యలు చేసింది. రెండు రోజుల క్రితం కొల్లాపూర్ లో ప్రచారం నిర్వహిస్తున్న బర్రెలక్కపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బర్రెలక్కతో పాటు ఆమె తమ్ముడిపై కూడా దాడి చేశారు. ఆమె తమ్ముడిని తీవ్రంగా గాయాలపాలు చేశారు.ఈ దాడి నేపథ్యంలోనే తనకు 2 + 2 గన్ మెన్లతో భద్రత కల్పించాలని బర్రెలక్క తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. శుక్రవారం (నవంబరు 24) దీనిపై విచారణ జరిగింది. హైకోర్టుకు వెళ్లడానికి మద్దతుగా అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం నాయకులు కావేట శ్రీనివాసరావు, కరణం రాజేశ్, ఆదిత్య దొడ్డల అండగా ఉన్నారు. బర్రెలక్కకు రక్షణ కల్పించాలని ఎస్పీని కూడా కోరతామని అన్నారు.

## కేసీఆర్‌ను జైలుకు పంపిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సభలో అమిత్‌షా ప్రసంగించారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే తెలంగాణ అభివృద్ధికి కంకణ బద్ధులై ఉంటామన్నారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసి రైతుల ఆదాయం, ఎగుమతులను పెంచి నాణ్యమైన పసుపు సాగును ప్రోత్సహిస్తామన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా గల్ఫ్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే బీసీ సీఎంను చేస్తామని ప్రకటించారు. పరీక్ష పత్రాలను లీకేజీ చేసిన వారిని జైలుకు పంపుతామన్నారు. కేసీఆర్ డబ్బులు ఇచ్చిన వారికే మంత్రి పదవులు కట్టబెట్టాడని ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కవిత మద్యం దందా నిర్వహించి కోట్లు సంపాదించారని చెప్పారు. ఈ సభలో ఆర్మూర్, బాల్కొండ నుంచి పోటీ చేస్తున్న పైడి రాకేష్‌రెడ్డి, ఏలేటి అన్నపూర్ణమ్మ, పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నరసయ్య, నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, లోక భూపతిరెడ్డి, పైడి రాకేష్ రెడ్డి సతీమణి రేవతి రెడ్డి, కుమార్తె సుచరిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

పుస్తకాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు యావత్ దేశానికి మార్గదర్శనంగా నిలిచాయని తెలిపారు. సంక్షేమంలో స్వర్ణ యుగాన్ని సృష్టించామన్నారు. రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గినట్టు సాక్షాత్తు నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పనితీరును ఇలాంటి నివేదికలెన్నో తేల్చిచెప్పాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారని కేటీఆర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలుచేసిన పథకాలు ప్రజలకు చేరువైన తీరును గణాంకాలతో సహా తన సంపాదకత్వంలో పుస్తకంగా వెలువరించిన సీనియర్ జర్నలిస్టు, సీఎం పీఆర్ఓ రమేష్ హజారీ కృషిని మంత్రి కేటీఆర్ అభినందించారు.

# జై బోలో తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయితే, పేపర్ లీకులు అవుతున్నాయని.. పేపర్ లీకులతో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఆత్మహత్యల కారణాలను కూడా ఈ ప్రభుత్వం వక్రీకరించిందని మండిపడ్డారు.పేపర్ లీకేజీల కుంభకోణాన్ని అరికట్టడానికి జాబ్ క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ తీసుకురాబోతుందన్నారు. మా అక్క చెల్లెళ్లకి క్షమాపణ చెప్తున్నా.. ఇంత సేపు నాకోసం అన్ని పనులు వదిలేసి వచ్చినందుకు అంటూ ప్రియాంక చమత్కరించారు. గ్రామ గ్రామాన వైన్స్, బెల్ట్ షాపులు అక్కా చెల్లెళ్ళ జీవితాలను పాడుచేస్తున్నాయన్నారు. తెలంగాణలో మహిళలపై అత్యాచారాలు బాగా జరుగుతున్నాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. మార్పు కావాలి అంటే కాంగ్రెస్ రావాలన్నారు ప్రియాంకా గాంధీ. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ప్రభుత్వం తెలంగాణ సర్కారు అని ఆమె విమర్శించారు. రైతు సంపాదించిన భూములను తెలంగాణ ప్రభుత్వం దోచుకుంటోందని ఆమె ఆరోపించారు. రైతులకి కనీస మద్దతు ధర కచ్చితంగా ఇస్తామని.. కేసీఆర్ సర్కార్ వచ్చి 10 సంవత్సరాలు గడిచినా అన్యాయమే జరుగుతోందని ప్రియాంక విమర్శించారు.మందులకి చివరి తేదీ ఎలా ఉంటాదో.. అలా బీఆర్ఎస్‌కు ఎక్సపైరీ తేదీ ఇప్పుడు వచ్చిందన్నారు. ప్రభుత్వాలు మీ ఆలోచనలను మరిచి వాళ్ల కుటుంబ పాలన కోసం పనిచేస్తున్నాయని మండిపడ్డారు. కేవలం ఈ ప్రభుత్వం ఫామ్ హౌస్‌లకే పరిమితం అంటూ విమర్శించారు. దళితులకు ప్రభుత్వం చేసింది ఏమి లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ ప్రాజెక్టులలో చాలా లక్షల కోట్ల కుంభకోణం చేసి దోచుకున్నారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ పార్టీలు ఒక్కటేనని.. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దొరల తెలంగాణ చేసిందని.. మేము వచ్చాక దొరల తెలంగాణని ప్రజల తెలంగాణ చేస్తామన్నారు.

**సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ విజయభేరి భారీ బహిరంగ సభ లో ప్రసంగించారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎం మాట్లాడాలో, ఎవరి గురించి చెప్పాలో అది చెప్పాలని వచ్చాను. బిఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎవరు సంతోషంగా లేరు, గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి ప్రాజెక్టులు పూర్తయ్యాయా. ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత తీసుకున్న ముల్కనూర్ గ్రామంలో ఏమయిన అభివృద్ధి జరిగింది. స్థానిక ఎమ్మెల్యే భూ నిర్వాసితుల పక్షాన మాట్లాడడా, 10 సంవత్సరాలు గడుస్తున్న నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాడా అని ప్రశ్నించారు. వడ్ల తూకంలో ఎక్కువ తరుగు తీస్తున్న స్థానిక ఎమ్మెల్యే ఏం చేశాడు. ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి పదువులు ఇచ్చాడు కానీ, ఒక్కరికి కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంలో చాలా అవినీతి జరిగింది, రైతుల రుణమాఫీ చెయ్యలేదు. రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక లో కాంగ్రెస్ రైతులకు రుణ మాఫీ చేసింది. ఆదాని కి దేశంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ అప్పగిస్తున్నాడని అన్నారు. రైతు ఒక్కరోజులో 70 రూపాయలు సంపాదిస్తుంటే, అదాని మాత్రం 16 వందల కోట్లు సంపాదిస్తున్నారు. 10 సంవత్సరాలు బిఆర్ఎస్ పాలన చూశారు, ఇప్పుడు కాంగ్రెస్ రాష్ట్ర అభివృద్ధికి ఒక ప్రణాళిక తో మీ ముందుకు వచ్చింది. ఎంఐఎం తెలంగాణలో పుట్టిన పార్టీ దేశంలో వివిధ రాష్ట్రాల్లో 50, 60 సీట్లలో పోటీ చేస్తుంటే రాష్ట్రంలో 8,9 సీట్లకు ఎందుకు పోటీ చేస్తుంది. ఓవైసీ ఎప్పుడు రాహుల్ గాంధీ ని నిందిస్తారు, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రజలను రాహుల్ గాంధీ కలిశారు.బిఆర్ఎస్ బిజెపి ఎంఐఎం కాంగ్రెస్ను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటున్నాయి, ఎందుకంటే వల్ల అవినీతి సొమ్మును బయటికి తీసి, ప్రజలకు పంచుతమని అన్నారు. సోనీయామ్మ తెలంగాణ ఇచ్చింది కాబట్టి ఆమెను మీరు గౌరవిస్తారు.

మహాత్మా గాంధీ నుండి ఇప్పటి వరకు మేము ప్రజల కోసం కొట్లడతున్నము. ప్రజల సంపద ప్రజలకే చెందలని కాంగ్రెస్ చూస్తుంది.కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం లోకి రాగానే 6 గ్యారంటీ లు అమలు చేస్తాం.ఛత్తీస్ ఘడ్, కర్ణాటక రాష్ట్రాల్లో చేసి చూపించాం. హుస్నాబాద్ లో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. మీరు ఈ సారి కాంగ్రెస్ పార్టీని గెలిపించండి, కాంగ్రెస్ మీ అభివృద్ధి కోసం పాటుపడుతుంది. మీరు ఈ సారి కాంగ్రెస్ పార్టీని గెలిపించండి, 5 ఎండ్ల తరవాత వచ్చి నేను ఇదే వేదిక పైన ఎం చేశామో గర్వంగా మాట్లాడుతాను. తెలంగాణ కోసం కొట్లదింది మీరు, రాష్ట్రం మీది, మీకోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది.ఈ కార్యక్రమంలో.. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ మాజీ ఎమ్మెల్యేలు చాడ వెంకటరెడ్డి,అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి తెలంగాణ ఆస్తి

(మొదటిపేజీ తరువాయి)

కరిచి చనిపోవుడు. విపరీతమైన బాధలు పడ్డాం. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉండే. వాటిని ఊడగొట్టింది కాంగ్రెస్సే కదా? గవర్నమెంట్ కాంగ్రెస్సే. ఒప్పందాలపై సంతకాలు పెట్టి ఉన్న హక్కులను పోగొట్టారు. తెలంగాణ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించుకున్నాం. అంతేకాకుండా 15వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. మీ కండ్ల ముందు జరిగిన చరిత్ర. అనేక కారణాలు ఉన్నయ్. కాంగ్రెస్ వాళ్లు ఉన్నప్పుడు ఇవ్వలేదు. మేం ఇస్తుంటే ఓరుస్త లేరు' అంటూ విమర్శించారు. కులం, మతం లేకుండా కలుపుకుపోతున్నాం.. 'ఎన్నో ఏండ్ల నుంచి పరిష్కారం కానీ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. అన్ని వర్గాలను, కులం మతం అనే తేడా లేకుండా కలుపుకొని ముందుకు తీసుకుని పోతుంది బీఆర్ఎస్ ప్రభుత్వం.

అందుకే మీరు మంచి పద్ధతుల్లో ఆలోచన చేసి ఓటేస్తే మంచి జరుగుతది. చందర్ గురించి మీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉద్యమ కారుడు. ఉద్యమ కాలంలో 74 రోజులు జైల్లో ఉన్నాడు. ఆయన కూడా సింగరేణి కార్మికుడి కుమారుడు. కాబట్టి సింగరేణి గురించి బాగా అవగాహనం ఉంది. ఇక బొగ్గు, నీళ్లు ఉన్నాయి. రవాణా వసతి ఉంది.

ట్రైన్ కూడా ఉంది. మాకు పరిశ్రమలు లేవు అని చందర్ చెప్పారు. రామగుండం నిర్లక్ష్యానికి గురైంది సమైక్య రాష్ట్రంలో. మనం ఇప్పుడు కుదుటపడ్డాం. ఈ ప్రాంతానికి రావాల్సిన పరిశ్రమల గురించి ఆలోచించి తీసుకువస్తాం. దాని కోసం నేను కృషి చేస్తాను' అని కేసీఆర్ హామీ ఇచ్చారు.

## రాజస్థాన్‌లో పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలిస్తే.. ఇక్కడ రాజేకు 1,16,484 ఓట్లు వచ్చాయి. అలాగే రాజేపై కాంగ్రెస్ తన అభ్యర్థిగా సౌంధియా రాజ్‌పుత్‌తో రాంలాల్ చౌహాన్ (పిడావా)ను బరిలోకి దింపింది. పిదవా ప్రాంతంలో సౌంధియా రాజ్‌పుత్ సామాజికవర్గానికి చెందిన మెజారిటీ ఓటర్ల కారణంగా కుల సమీకరణాన్ని పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ రాంలాల్ చౌహాన్‌కు టికెట్ ఇచ్చింది.

సర్దార్‌పురా: రాజస్థాన్‌లోని సర్దార్‌పురా స్థానం రాష్ట్రం వెలుపల కూడా చర్చనీ యాంశమైంది, ఎందుకంటే రాష్ట్ర ముఖ్యమంత్రి , కాంగ్రెస్ నాయకుడు అశోక్ గెహ్లాట్ ఇక్కడి నుంచి బరిలో ఉన్నారు. గెహ్లాట్ సర్దార్‌పురా నుంచి ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. 1977లో తొలిసారి ఇక్కడి నుంచి గెలుపొంది, ఆ తర్వాత 1999, 2003, 2008, 2013, 2018 ఎన్నికల్లో సర్దార్‌పుర నుంచి గెలుపొందారు. గెహ్లాట్ ముందు మహేంద్ర సింగ్ రాథోడ్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది.

టోంక్: రాజస్థాన్‌లోని టోంక్ సీటులో కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్‌పై బీజేపీ అభ్యర్థి అజిత్ సింగ్ మెహతా పోటీలో ఉన్నారు. పైలట్ 2018లో తొలిసారిగా టోంక్ నుంచి పోటీ చేసి ఇక్కడి నుంచి గెలుపొందారు, ఆ తర్వాత పార్టీ ఆయనను రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కూడా చేసింది. అజిత్ సింగ్ మెహతా 2013 నుంచి 2018 వరకు టోంక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అటువంటి పరిస్థితిలో, టోంక్‌లో మెహతా మరోసారి వికసించవచ్చని బీజేపీ భావిస్తోంది. అయితే 1998, 2003, 2008లో టోంక్ నుంచి కాంగ్రెస్ విజయం సాధించింది.

లక్ష్మణ్‌గఢ్: ఈ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోటసారపై బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి సుభాష్ మహరియా పోటీ చేస్తున్నారు. దశాబ్దం తర్వాత ఇరువురు నేతలు ముఖాముఖి కానున్నారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో దోటసార మహరియాను భారీ మెజార్టీతో ఓడించి సీటును నిలబెట్టుకున్నారు. యాదచ్ఛికంగా, ఇద్దరూ ఒకే కమ్యూనిటీ, జాట్‌కు చెందినవారు.సికార్ నుంచి మూడుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన మహరియా 2016లో కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఈ ఏడాది




మేలో తిరిగి బీజేపీలోకి వచ్చారు. జాట్‌లు , ముస్లింలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) విజేంద్ర ధాకా , ఆర్ఎల్‌పీకి చెందిన విజరు పాల్ బగారియా కూడా అభ్యర్థులు.

సవాయి మాధోపూర్: సవాయి మాధోపూర్‌లో ముక్కోణపు పోటీ నెలకొంది. ఈ స్థానంలో బీజేపీ సిట్టింగ్ రాజ్యసభ ఎంపీ కిరోరి లాల్ మీనాను పోటీకి దింపింది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన వారికి టికెట్ ఇవ్వడం ద్వారా, 2018లో పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆశా మీనాను కాషాయ పార్టీ టిక్కెట్టు ఆశావహుల నుంచి పక్కన పెట్టింది.అయితే ఈ ఎన్నికల్లో 25 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయిన ఆమె ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే డానిష్ అబ్రార్ బరిలోకి దిగడంతో ఈ స్థానం ముక్కోణపు పోటీకి సిద్ధమైంది. మీనా 2008లో బీజేపీని వీడి 2018లో మళ్లీ బీజేపీలో చేరారు.సవాయి మాధోపూర్ నియోజకవర్గంలో మీనాలు, ముస్లింలు, బనియాలు , బ్రాహ్మణులు ఆధిపత్యం చెలాయించగా, గుర్జర్లు , మాలీలు కూడా ఇక్కడ గణనీయమైన ఉనికిని కలిగి ఉన్నారు. రాజస్థాన్‌లోని శక్తివంతమైన నాయ కులలో మీనా ఒకరు, కానీ ఒంటరిగా ఉన్న ఆశా మీనా యొక్క సవాలు అతనికి సమస్యలను సష్టించవచ్చు.

నాథ్‌ద్వారా: ప్రముఖ మేవార్ రాజు, రాజ్‌పుత్ యోధుడు మహారాణా ప్రతాప్ వారసుడు విశ్వరాజ్ సింగ్ మేవార్‌ను నాథ్‌ద్వారా స్థానంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీపీ జోషిపై బీజేపీ పోటీకి దింపింది. శతాబ్దాల తరబడి మాజీ మేవార్ రాజకుటుంబానికి ప్రజ లతో ఉన్న అనుబంధం ,బీజేపీకి ఉన్న ప్రజాదరణ నాథ్‌ద్వారాలో విజయం సాధించేలా చేస్తుంది, ఇది మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న విశ్వరాజ్ సింగ్ మేవార్ ఆశ.సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీపీ జోషి నాథ్‌ద్వారా యొక్క ప్రస్తుత ఎమ్మెల్యే , అసెంబ్లీ స్పీకర్. ఈ స్థానానికి ఆయన ఐదుసార్లు ప్రాతినిథ్యం వహించారు. అయితే, కేంద్రంలోని తమ ప్రభుత్వ పనితీరును ప్రదర్శించడం ద్వారా , ఎన్నికల పోటీని "ప్రైడ్ ఆఫ్ మేవార్" విశ్వరాజ్ సింగ్‌తో ముడిపెట్టడం ద్వారా ఈ స్థానాన్ని గెలుచు కోవాలని బీజేపీ భావిస్తోంది .నాద: ద్వారా లో 2.5 లక్షల మంది ఓటర్లు ఉన్నారు , ఇందులో ప్రధాన భాగం రాజ్‌పుత్‌లు , బ్రాహ్మ ణులు, ఓటర్లున్నారు.

జోత్వారా: ఒలంపిక్ పతక విజేత, రెండు సార్లు ఎంపీగా ఎన్నికైన రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ను బీజేపీ ఝోత్వారా స్థానం నుంచి బరిలోకి దిం పింది. జోత్వారా జైపూర్ రూరల్ లోక సభ స్థానం పరిధిలోకి వస్తుంది, ఇక్కడ నుండి రాథోడ్ ఎంపీ గా ఉన్నారు. రాజ్యవర్ధన్‌కు ముందు కాంగ్రెస్ ఎన్ఎస్‌యువై రాష్ట్ర అధ్యక్షుడు అభిషేక్ చౌదరి (38)కి టికెట్ ఇచ్చింది.

## సంపాదకీయం

# మరో కొత్త వైరస్ కలకలం

ప్రపంచ దేశాలను వణికించేందుకు మరో కొత్త వైరస్ రాబోతోంది. కరోనా మహమ్మారి పురుడుపోసుకున్న చైనా దేశంలోనే ఇది గుర్తించబడడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అంతుచిక్కని నిమోనియా వ్యాధితో స్కూలు విద్యార్థులు పదుల సంఖ్యలో ఆస్పత్రిపాలవుతుండడంతో దీని తీవ్రతపై వైద్యులు అంచనా వేయలేకపోతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఇప్పటికే బీజింగ్, లియోనింగ్ సిటీల్లోని ఆస్పత్రులు బాధితల విధ్యార్థుల తల్లిదండ్రుల ఆర్తనాదాలతో భయానకంగా దర్శనమిస్తున్నాయి. అక్కడి తాజా పరిస్థితులు కరోనా మిగిల్చిన చేతు జ్ఞాపకాలను, భయాలను పునరావృతం చేసేలా ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ మిస్టరీ నిమోనియా అది వేగంగా వ్యాపిస్తుండటంతో స్కూళ్ల మూసివేత తప్పదని ఇప్పటికే స్థానిక మీడియా కథనాలు ప్రచురించాయి. 2019లో ప్రపంచం మొత్తాన్ని కరోనా గడగడలాడించింది. ప్రపంచమంతా ఇళ్లకే పరిమితమైపోవడంతో.. జనజీవనం పూర్తిగా నిలిచిపోయింది. అంతకముందు భారతదేశంలోని కేరళలో నిపా వైరస్ వణికించిన ఘటనను కూడా చూశాం. తాజాగా మరో రాష్ట్రంలో కొత్త రకం వైరస్ విజృంభిస్తోంది. అది కూడా కేరళ రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న తమిళనాడు. కోవిడ్ పేరు చెబితే చాలు.. అప్పటి పరిస్థితులు కళ్ల ముందు కనబడుతుంటాయి. ఎక్కడ చూసినా లాక్‌డౌన్, బయటకు వెళ్లాలంటే ఆంక్షలు.. మాస్క్ లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి. కుటుంబ సభ్యులతో కూడా సాధారణంగా పక్కనే ఉండలేని పరిస్థితి. ఇక ఆస్పత్రుల్లో భయానక దృశ్యాలు, ఆక్సిజన్ అందక వేలాది మంది మృత్యువాత.. కరోనా మృతులతో మార్చురీలు కూడా సరిపోక గదుల్లో గుట్టలు గుట్టలుగా మృతదేహాలు. స్మశానాలన్నీ హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టినంత దృశ్యాలు. అలాంటి వాతావరణం నుంచి బయటపడడానికి కొన్ని నెలల సమయం పట్టింది. అంతా సర్దుకుంది అనుకుంటుండగా ఇప్పుడు దేశంలో అలాంటి వైరస్ మళ్లీ భయపెడుతోంది. తమిళనాడులో బయటపడ్డ కొత్త వైరస్ ఆందోళనను పెంచుతోంది. ఆ వైరస్‌ను ప్రస్తుతం 'ఫ్లూ వైరస్'గా పిలుస్తున్నారు. వేగంగా విజృంభిస్తున్న వైరస్ ప్రభావంతో జనం ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో అప్రమత్తమైన తమిళనాడు సర్కార్.. మాస్క్ లేకుండా ఎవరు బయటికి రావద్దని ఆదేశాలు జారీ చేసింది. కోయింబత్తుర్ జిల్లాలో ఈ తరహా కేసులు ఎక్కువగా ఉండడంతో.. ఆ జిల్లావ్యాప్తంగా అలెర్ట్ జారీ చేసిన కలెక్టర్.. పక్క జిల్లాల కలెక్టర్లను కూడా అప్రమత్తం చేశారు. ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రయివేటు ఆస్పత్రుల్లో కూడా ఈ ఫ్లూ వైరస్ కేసులు నమోదవుతున్నాయి. ముందుగా జ్వరం వస్తోంది. ఆ తర్వాత ఒళ్లునొప్పులు.. ఈ రెండు లక్షణాలు మలేరియా, టైఫాయిడ్ లక్షణాలే అనుకుని వైద్యులు కూడా అదే తరహా చికిత్స చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత కొత్త లక్షణాలు బయటపడటంతో వైద్యులు సైతం ఆందోళన పడ్డారు. ముక్కులో నుంచి నీరు కారడం, తలనొప్పి రావడం ఈ 'ఫ్లూ వైరస్' లక్షణాలుగా ఉన్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ చిన్నారులు, యాభై ఏళ్ళ పైబడ్డ వారే ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రెండు రోజుల నుంచి కోయింబత్తూర్ జిల్లాలో ఎక్కువగా ఫ్లూ వైరస్ కేసులు నమోదవుతున్నాయి. తమిళనాడు ? కేరళ సరిహద్దు జిల్లాలో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఎవరు మాస్క్ లేకుండా తిరగరాదని ఆదేశాలు జారీ చేశారు. కోయంబత్తూర్‌లో నెలకొన్న పరిస్థితులపై తమిళనాడు ప్రభుత్వం అలెర్ట్ జారీ చేసింది. ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి జ్వరం లక్షణాలతో ఉన్నవారిని గుర్తించి వైరస్‌కి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేరళలో ముందుగా ఈ వైరస్ బయట పడి ఉంటుందని అనుమానిస్తున్నారు అధికారులు. దీంతో కేరళ నుంచి వచ్చేవారిపై ఆంక్షలు అమలు చేస్తున్నారు. చాలా చోట్ల సరిహద్దు మార్గాలను మూసివేసి తనిఖీలు చేపడుతున్నారు. ఇంకా తమిళనాడులో ఎక్కడైనా ఇలాంటి కేసులు నమోదయ్యాయా అనే అనుమానంతో వివరాలు సేకరిస్తున్నారు.

### భారీ మెజార్టీతో రోహిత్ ను

# గెలిపించుకుంటాం

**చిన్న శంకరంపేట -ప్రభాత సూర్యుడు:** మెదక్ నియోజకవర్గ ప్రజలు బిఆర్ ఎస్ మాటలు ఇక నమ్మలేరని అభివృద్ధిలో నియోజకవర్గం చాలా వెనకబడి ఉందని పది సంవత్సరాలలో పద్మ దేవేందర్ రెడ్డి చేసింది ఏమీ లేదని మైనంపల్లి రోహిత్ రావును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని శంకరంపేట వార్డు మెంబర్ మేడి గణేష్ ముదిరాజ్ ప్రభాత సూర్యుడు ప్రతినిధితో అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో ఏ ఊరికి వెళ్ళిన ఏ వాడకు వెళ్లిన రోహిత్ రావ్ కు బ్రహ్మరథం పడుతున్నారని మేమున్నాము అని భరోసా ఇస్తూ స్వాగతిస్తున్నారని ఆయన అన్నారు. గతంలో మైనంపల్లి హనుమంతరావు ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో చేసిన సేవలే ప్రజలు గుర్తుంచుకొని రోహిత్ రావును ప్రతి ఓటరు దేవుళ్ళు కుటుంబ సభ్యులుగా ఆదరిస్తున్నారని మేడి గణేష్ అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా అధిష్టానం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ ల గురించి ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ మెదక్ గడ్డపై జెండా ఎగరవేయడం ఖాయమని ప్రజలందరూ బాగుపడడం జరుగుతుందని ఆయన అన్నారు.



# రైతుల చుట్టూ రాజకీయాలు..!

**నిజామాబాద్- ప్రభాత సూర్యుడు**



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తరువాత మూడవ శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే, ఈ ఎన్నికలు.. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా సాగుతున్నాయి. రెండు దఫాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. సరికొత్త సంక్షేమ పథకాలు, ప్రజాకర్షక హామీలతో ఓటర్లను తమవైపు లాగే ప్రయత్నం చేస్తుంది. ఈ మేరకు ప్రచార పర్వం సాగిస్తోంది. అదే సమయంలో.. బీఆర్ఎస్‌కు ధీటైన పోటీ ఇస్తోంది కాంగ్రెస్. ఏదైతే సంక్షేమం పేరుతో బీఆర్ఎస్ పై చేయి సాధిస్తుందో.. అవే సంక్షేమ పథకాలతో ఎన్నికల కథన రంగంలోకి దూసుకెళ్తుంది. మార్పు రావాలని, ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ ఓటర్లకు గాలం వేస్తోంది. ఇక బీజేపీ సైతం తానేం తక్కువగా అంటూ ప్రజలపై ఎన్నికల వరాలు గుప్పిస్తోంది. ఎవరి హామీలు ఎలా ఉన్నా? ఏ పార్టీ మేనిఫెస్టోలో ఏ అంశాలు పేర్కొన్నా.. జనం ఎవరి వైపు మొగ్గు చూపుతున్నారనేదే ఇప్పుడు తెలంగాణలో ప్రధాన చర్చ. మూడోసారి అధికారం తమదేనంటూ బీఆర్ఎస్ పూర్తి విశ్వాసంలో ఉండటానికి కారణం.. రైతులు తమవైపు ఉన్నారనే ధైర్యం. అదే సమయంలో ఫించన్ దారులు సైతం తమకే ఓటు వేస్తారని, ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారులు తమకే ఓటు వేస్తారనే విశ్వాసంతో ఉంది. ఆ కారణంగానే బీఆర్ఎస్‌లో అధికారంపై ధీమా ఉంది. పదేళ్లలో పథకాల పేరుతో రాష్ట్రానే దోచుకున్నారంటూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు కాంగ్రెస్ కూడా ఇప్పుడు అలాంటి పథకాలనే ప్రకటించింది. రైతులకు వడ్డీ లేని పంట రుణాలు, రూ. 2 లక్షల రుణ మాఫీ, పంటలకు గిట్టుబాటు ధర సహా అనేక పథకాలు ప్రకటించి రైతులను తమవైపు లాగే ప్రయత్నం చేసింది. వాస్తవానికి తెలంగాణలో మొత్తం వ్యవసాయ భూమి దాదాపు 1.43 కోట్ల ఎకరాలు ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 55 శాతం మంది ప్రజల వ్యవసాయాధార జీవనం సాగిస్తున్నారు. ఈ రైతులే ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటును నిర్దేశించనున్నారు. రైతులు ఎటువైపు తలొగ్గితే.. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం చేపట్టనుందనడంలో ఎలాంటి సందేహం. గత ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. 10 మే 2018 రోజున కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన రైతు బంధు పథకంతో రైతులంతా బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారు. దాని ఫలితంగానే ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 88 సీట్లు గెలుచుకుని ఘన విజయం సాధించింది. ఇప్పుడు కూడా ఆ రైతేలే పార్టీల జయాపజయాలను నిర్దేశించనున్న నేపథ్యంలో ప్రధానా పార్టీలు రైతులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యాయి. ఈ క్రమంలో రైతులపై వరాల జల్లు కురిపిస్తున్నాయి.

**రైతులకు బీఆర్ఎస్ హామీలు..**

ఇప్పటికే అనేక రైతు సంక్షేమ పథకాలు ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ.. ఇప్పుడు ఆ పథకాలనే విస్తృతం చేస్తున్నట్లు ప్రకటించింది. రుణ మాఫీని కంటిన్యూ చేస్తామంది. రైతులకు ఇప్పటి వరకు ఇస్తున్న ఎకరానికి రైతుబంధు రూ. 5 వేల మొత్తాన్ని మరోసారి అధికారంలోకి వస్తే.. దశలవారీగా రూ.16 వేలకు పెంచుతామని ప్రకటించింది. ఇక రైతులకు ఇస్తున్న 24 ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తామంది. అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించి ఆంక్షలు ఎత్తివేస్తామన్నారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామన్నారు. ధరణి ద్వారా భూకబ్జాలను అరికడతామని ప్రకటన.

రైతులకు కాంగ్రెస్ ప్రకటించిన హామీలు..

'రైతు భరోసా' పేరుతో రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు

వ్యవసాయ కార్మికులకు రూ. 12,000

వరి క్వింటాలుకు రూ.500 బోనస్

వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంట్

రూ. 2 లక్షల వరకు రుణ మాఫీ

ధరణి స్థానంలో భూమాత తీసుకొస్తామని ప్రకటన.

ఈ పథకాలతో రైతులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది కాంగ్రెస్. అంతేకాదు.. ఈ పథకాలను జనాల్లో విస్తృతంగా తీసుకెళ్తుంది.

**బీజేపీ హామీలు..**

బీజేపీ కూడా రైతుల కోసం ప్రత్యేక హామీలు ప్రకటించింది. ధరణి స్థానంలో పార్దర్శకమైన 'మీ భూమి' వ్యవస్థను తీసుకువస్తామని ప్రకటించింది. రైతును రాజు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామంది. విత్తనాల కొనుగోలుకు రూ. 2500 ఇన్‌పుట్ అసిస్టెన్స్ అందిస్తామంది. నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామంది.

ఇలా ప్రధాని పార్టీలు రాష్ట్ర రైతాంగాన్ని తమవైపు తిప్పుకునేందుకు హామీలు గుప్పిస్తున్నాయి. మరి రైతులు.. ఈ హామీలలో వేటిని విశ్వసిస్తారు. ఏ పార్టీకి అండగా నిలబడతారు.. తెలంగాణలో తదుపరి ఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారనేది ఇప్పుడు అందరిలోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# బీజేపీ లేకుంటే తెలంగాణ ఎక్కడది

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**





తెలంగాణ ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కేవలం కేసీఆర్ ఒక్కడి వల్లే తెలంగాణ ఏర్పడలేదని తెలిపారు. తెలంగాణలో ఏర్పడేదీ బీజేపీ సర్కారేనని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో ప్రచారంలో బీజేపీ దూకుడు కనబరుస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు ముఖ్యనేతలు ప్రచారంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. తాజాగా తెలంగాణలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రచారం నిర్వహించారు. మల్కాజిగిరి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థుల తరఫున రోడ్ షో నిర్వహించారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.. అధికారమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు హోరాహోరీగా ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజున, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రోడ్ షో నిర్వహించారు. అనంతరం తెలంగాణలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఐదు రాష్ట్రాల్లోనూ భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రానున్నట్లు స్పష్టం చేశారు. స్వాతంత్ర్య అనంతరం అవినీతి ఆరోపణలు లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు లేదని కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ మంత్రులు కూడా అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేశారు. రాజస్థాన్‌లో మహిళలను రక్షించడంలో సీఎం అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఇలాంటి ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే హక్కు లేదని అన్నారు. రాజస్థాన్‌లో పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఒక మహిళా ఎమ్మెల్యే కూడా తనకు భద్రత లేదని భావించారని అన్నారు. రాష్ట్రంలో జరిగిన పలు హత్యలు, పేపర్ లీకేజీల ఘటనలను కూడా ప్రస్తావించిన ఆయన, ఎలాంటి కారణం లేకుండా టైలర్ కన్హయ్య లాల్‌ను హత్య చేసేంత స్థాయిలో శాంతిభద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తారు. బీజేపీకి ఏ రాష్ట్రంలోనూ నాయకత్వ సంక్షోభం లేదన్న ఆయన.. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడం లేదన్నారు. ప్రతి రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వానికి ఖచ్చితమైన ప్రణాళిక ఉంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత సీఎం పేరును ఖరారు చేస్తామన్నారు. ఎన్నికల తర్వాత నాయకుడిని ఎన్నుకోవడంలో బీజేపీకి ఎలాంటి సమస్య ఉండదన్నారు. అందరి అభిప్రాయాల మేరకే ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తామన్నారు. అయితే తెలంగాణలో మాత్రం ముందస్తుగా బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించి, ఎన్నికలకు వెళ్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. రాజస్థాన్‌లో అధికారంలోకి రావడం ఖాయమన్న రాజ్‌నాథ్ సింగ్, మూడింట రెండు వంతుల మెజారిటీని సాధిస్తామన్నారు. వసుంధర రాజే బలమైన నాయకురాలన్న ఆయన, రాజస్థాన్‌లో గెలుపు కోసం పూర్తి అంకితభావంతో ఎన్నికలలో నిమగ్నమై ఉన్నారన్నారు. అటు మధ్యప్రదేశ్‌లోనూ మరోసారి ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కూడా మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామనే నమ్మకంతో ఉన్నామన్నారు. తెలంగాణ ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు రాజ్‌నాథ్ సింగ్. విశ్వగురుగా పేరు తెచ్చుకున్న ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. రాహుల్ గాంధీ అహంకారంతో కూడిన మాటలు మాట్లడుతున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ అంటేనే జనం అసహించుకుంటున్నారన్నారు. రాజౌరి దాడిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటు స్పందించారు. పాకిస్థాన్ చేష్టలు మానుకోవాలని హితవు పలికారు. లేదంటే కశ్మీర్‌లోని ఆర్మీ ధీటుగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. కాశ్మీర్‌లో ఇటీవల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో హమాస్, లష్కరే ఐక్యమయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమన్నారు.

## తెదేపా రాష్ట్ర నాయకురాలు

# బిఆర్ఎస్‌లో చేరిక



కుత్బుల్లాపూర్ -ప్రభాత సూర్యుడు

కెసిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలే బిఆర్ఎస్ పార్టీ చేసిన ప్రజాసేవల వల్లే ఆకర్షితులై నియోజకవర్గ అభివృద్ధి సాధన లో పాలుపంచుకుంటుందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీమతి సాయితులసీ శుక్రవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని పార్టీ యూత్ నాయకులు వినీత్ తెలిపారు. అనంతరం ఇంటింటి ప్రచారంలో భాగంగా బొట్టు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కల్పన ,సూర్యప్రభ, కవిత ఉన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

## కేంద్ర ఎన్నికల పరిశీలకులు బసవరాజేంద్ర

జగిత్యాల - ప్రభాత సూర్యుడు

ఈనెల 30న జరుగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర సూచించారు...శుక్రవారం జిల్లా కేంద్రంలోని అతిథి గృహంలో కేంద్ర ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్రను తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అస్సోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ సిటీజేన్స్ ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందించి వృద్ధులు,దివ్యంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్య కల్పనకు కృతజ్ఞతలు తెలిపారు.సీనియర్ సిటిజెన్లకు,దివ్యంగులకు ప్రత్యేక క్యూ సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ జిల్లాలో 80 ఏళ్ళు పై బడిన వృద్ధులు ,40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యంగులు ఎన్నికల కమిషన్ కల్పించిన హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించు కోవడాన్ని అభినందించారు. పోలింగ్ రోజున సైతం వృద్ధులు ,దివ్యంగులు నేరుగా వోటింగ్ సౌకర్యం పొందవచ్చని,అలాగే జిల్లా సీనియర్ సిటీజేన్స్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా సూచనల మేరకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించు కోవాలని,హోమ్ ఓటింగ్ పై అవగాహన కల్పించడంపై అసోసియేషన్ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,వారి సంఘ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో లైజన్ అధికారి ఎండి.వకీల్ , సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,కార్యదర్శి గౌరిశెట్టీ విశ్వనాథం, ఉపాధ్యక్షుడు ఎండి.యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.ఆశోక్ రావు, సయ్యద్ యూసుఫ్, ఎండి.ఎక్బాల్, బొల్లం విజయ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పదేండ్లలో రూ.6 లక్షల కోట్ల అప్పు

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థులు వేముల వీరేశం, మందుల సామేలు, ఏఐసీసీ పరిశీలకులు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్, పీసీసీ నాయకులు అద్దంకి దయాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డీవీ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు దుబ్బాక నరసింహారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 6 గ్యారంటీల పేరుతో

# కాంగ్రెస్ మోసం

### - మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితాఇంద్రారెడ్డి



కందుకూరు- ప్రభాత సూర్యుడు: కాంగ్రెస్ ఐదు గ్యారంటీలతో కర్నాటక ప్రజలను మోసం చేసిందని, ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసేం దుకు ప్రయత్నం చేస్తున్నదని మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. శుక్రవారం కందుకూరు మండలంలోని నేదునూరు, దాసర్లపల్లి, సాయి రెడ్డి గూడ, ముచ్చర్ల, దెబ్బడగుడా, కందుకూరు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి కర్ణాటక ప్రజలు అధికారాన్ని అప్పగిస్తే ప్రజలకు నరకం చూపి స్తున్నారని ఆరోపిం చారు. కర్నాటకలో ఫెయిల్యూర్ మోడల్‌ను మెడలో వేసుకుని తెలం గాణకు వస్తున్నారని అన్నారు. తెలం గాణలో చేపట్టిన పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం కర్నాటక మోడల్ అమలు చేస్తామని చెప్తుంటే నవ్వొ స్తుందని అన్నారు. కాంగ్రెస్ నేతలు గెలిచేవరకు ఒక్క ఛాన్స్ చెప్పి మోసం చేసేందుకు ప్రయ త్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

# హోం ఓటింగ్ విధానాన్ని నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



జగిత్యాల-ప్రభాత సూర్యుడు: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు హోం ఓటింగ్ విధానాన్ని నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. ఇంటి నుండి ఓటు హక్కు వినియోగం సందర్భంగాశుక్రవారం రోజున జగిత్యాల, కోరుట్ల నియోజక వర్గంలలో హోం ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. మొదటి సారిగా ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ పద్ధతిని ప్రవేశపెట్టినందున కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజక వర్గాలలో12 డి ఫారం ద్వారా హోం ఓటింగ్ కోసం 1141 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నెల 24,25 తేదీలలో 80 ఏళ్లకు మించిన వయోవృద్ధులు, 40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. జగిత్యాల పట్టణంలోని గాంధీ నగర్, కోరుట్ల పట్టణంలోని 4 వ వార్డులలో జరిగిన హోం ఓటింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. ఆయా సెక్టో రల్ అధికారులు, సిబ్బంది, ఏజంట్లు, తదితరులు ఉన్నారు.

# హుజూరాబాద్‌లో ట్రైయాంగిల్ ఫైట్



కరీంనగర్ - ప్రభాత సూర్యుడు: తెలంగాణలో కీలకమైన మరో నియోజకవర్గం హుజూరాబాద్. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే, బీజేపీ ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సొంత నియోజకవర్గం ఇది. ఇక్కడి నుంచి ఈటల రాజేందర్ ఇప్పట ఇరకు ఏడుసార్లు విజయం సాధించారు. ప్రతీసారి తిరుగులేని మెజారిటీ సాధిస్తూ.. హుజూరాబాద్ గడ్డ.. ఈటల అడ్డా అన్నట్లుగా మార్చేశారు. కానీ, మూడు దశాబ్దాల తర్వాత ఇక్కడ ఈటల గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. బీజేపీ తరఫున హుజూరాబాగ్, గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ ఈసారి రెండుచోట్ల గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ గ్రౌండ్ రిపోర్ట్ ఇందుకు విరుద్ధంగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. స్థానిక ఓటర్లు ఈసారి మార్పు కోరుకుంటున్నారు. మరోవైపు ఈసారి ఇక్కడి నుంచి బరిలో దిగిన కాంగ్రెస్ అభ్యర్థి భారీగా ప్రభుత్వ వ్యతిరే ఓట్లను చీలుస్తారని తెలుస్తోంది. దీంతో ఈసారి ఈటల గెలుపు అంత ఈజీ కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు పాడి కౌశిక్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు కాంగ్రెస్ టికెట్‌పై ఈటలతో తలపడ్డారు. రెండుసార్లు ఓడి పోయారు. ఈసారి బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. ఈసారి ఎలాగైనా ఈటలను ఓడించాలని సర్వశకక్తులు ఒడ్డుతున్నారు. చివరకు తన భార్య, బిడ్డను కూడా ప్రచారంలోకి దించాడు. కౌశిక్‌రెడ్డి భార్య అయితే ఏకంగా కొంగు చాపి తన భర్తకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అర్థిస్తోంది. ఇక కౌశిక్‌రెడ్డి 12 ఏళ్ల కూతురు కూడా తండ్రిని గెలిపించాలని ప్రచార సభల్లో ప్రసంగిస్తోంది. మా నాన్నను గెలిపిస్తే హుజూరాబాద్‌ను హైదరాబాద్‌లా మారుస్తాడని చెబుతోంది. అదే విధంగా రామక్క పాటకు రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తోంది. దీంతో ఈసారి కౌశిక్‌కు సానుభూతి ఓట్లు పడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇక ఈసారి కాంగ్రెస్ కూడా బలమైన అభ్యర్థిని హుజూరాబాద్ బరిలో దించింది. ఉప ఎన్నికల్లో బల్మూరి వెంకట్‌ను ఈటలపూ పోటీ చేయించింది. కానీ డిపాజిట్ కూడా రాలేదు. ఈసారి ఒడితెల ప్రణవ్. టీఆర్ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన కెప్టెన్ లక్ష్మీకాంతరావు మనుమడు ప్రణవ్. నియోజకవర్గ పునర్విభజనకు ముందు హుస్నాబాద్, హుజూరాబాద్ కమలాపూర్ నియోజకవర్గంలో ఉండేవి. కమలాపూర్‌లో కెప్టెన్‌కు మంచి పట్టు ఉంది. దీంతో ఈసారి కాంగ్రెస్ పార్టీ కెప్టెన్ మనుమడిని హుజూరాబాద్ బరిలో నిలిపింది. దీంతో భారీగా ఓట్లు చీలుస్తాడని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రణవ్ కూడా బీఆర్ఎస్, బీజేపీకి దీటుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో గెలుపుపై ధీమాతో ఉన్నారు. ఒకవైపు కౌశిక్‌రెడ్డి, మరోవైపు ఒడితెల ప్రణవ్.. ఈసారి హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. మరోవైపు ఈటల ఈసారి హుజూరాబాద్ కంటే.. గజ్వేల్‌పైనే ఎక్కువ దృష్టిపెట్టారు. ఇక్కడ ఆయన సతీమణి జమునారెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈటల ముఖ్య మంత్రి అవుతాడన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. అదొక్కటే ఈటలకు పాజిటివ్. ఇక ప్రణవ్ ఓట్లను చీలుస్తారని భావిస్తుం డడంతో అటు బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి, ఇటు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ టెన్షన్ పడుతున్నారు. ప్రణవ్ ఎవరి ఓట్లు చీలుస్తాడో ఆందోళన రెండు పార్టీల్లో కనిపిస్తోంది.

# సదర్ పండుగ యాదవ కులస్తుల ఐక్యతకు ప్రతీక

## బిలకంటి శేఖర్ రెడ్డి ,రాజు నాయక్






యాచారం - ప్రభాత సూర్యుడు

యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో సదర్ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు నాయక్ మాట్లాడుతూ సదర్ పండుగ హైదరాబాద్ నగరంలో జరిగే ప్రధాన ఉత్సవాలలో సదర్ పండుగ ఒకటి. ఈ పండుగను నగరంలోని యాదవ కులస్తులు మాత్రమే జరుపుకుంటారని అన్నారు. కాలక్రమేణా గ్రామీణ ప్రాంతాల్లో కూడా యాదవ కులస్తులు ఐక్యమతంగా, కలిసి మెలిసి ఈ సదర్ పండుగను జరుపుకుం టున్నారు. అలాగే నంది వనపర్తి గ్రామంలో కులాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా, ఈ సదర్ ఉత్సవాన్ని జరుపుతున్నందుకు గ్రామంలో అందరి కలిసి మెలిసి ఉండాలని యాదవ సంఘానికి కుల పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. మూడేడ్ల వెంకట్ రెడ్డి, కొంగల జోగిరెడ్డి, కంబాలపల్లి మల్లెడ్డి, ముక్తాల యాదయ్య గౌడ్, వంగూరు యాదయ్య, వంగూరు మల్లేష్, జనిగా వెంకటేష్, గోగికర్ జాంగిర్, గోగికార్ రమ్ము, కొండాపురం శ్రీశైలం, నెట్టి బీరప్ప, నర్రె శ్రీశైలం, వంగూరి సాయి,యాదవ కులస్తులు ,కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ దోచుకున్న సొమ్ము ప్రజలకు పంచుతాము

## మైనంపల్లి హనుమంతరావు



చిన్న శంకరంపేట్ - ప్రభాత సూర్యుడు

కెసిఆర్ తెలంగాణ ను భ్రష్టు పట్టించారని లక్షల కోట్ల భూములు దోచుకున్నారని ఆయనకు తోడు మెదక్ ఎమ్మెల్యే భర్త దేవేందర్ రెడ్డి ఉన్నారని ఆ డబ్బును వారిచే కక్కించి ప్రజలకు పంచుతామని మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆరోపించారు. మెదక్ నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఉమ్మడి చిన్న శంకరంపేట మండలంలోని గవ్వలపల్లి ,శేరిపల్లి గ్రామాలలో ప్రజలకు ఆరు గ్యారెంటీ ల గురించి వివరిస్తూ ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు పాసులు , రైతులకు రుణమాఫీ లాంటి పథకాలు మన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే డిసెంబర్ తొమ్మిది నుంచే అమలవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆవుల గోపాల్ రెడ్డి , యాదవరావు, శంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి ,ఉపసర్పంచ్ జీవన్, మాజీ ఏఎంసి చైర్మన్ గంగా నరేందర్, మాజీ మండల అధ్యక్షులు అరుణ ప్రభాకర్, నాయకులు మేడి గణేష్ ,ఎర్రి కుమార్ ,ఎల్లబోయిన బాబు ,రమేష్ గౌడ్ మరియు మహిళా నాయకులు భారీఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215